సాక్షి శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు

శనివారం । 11 । ఫిబ్రవరి । 2023



నేరాల కట్టడికి చర్యలు

పుణ్యక్షేత్రాలు, పర్యాటక ప్రాంతాల్లో నేరాలను కట్టడి చేసేందుకు పోలీసు అవుట్‌పోస్టులను శుక్రవారం ప్రారంభించారు. వీటిల్లో 24 గంటలూ సిబ్బంది అందుబాటులో ఉంటారు. 8లో



బంగారం ధరలు

24 క్యారెట్లు (10 గ్రా)	రూ.58,850
22 క్యారెట్లు ఆర్నమెంట్ (1 గ్రా)	రూ.5,357
3 శాతం జీఎస్టీతో	రూ.5,415
సవర (8 గ్రా)	రూ.43,320

వాతావరణం

గరిష్టం/కనిష్టం 33.4 /22.6

జిల్లా వ్యాప్తంగా పగటి, రాత్రి ఉష్ణోగ్రతలు క్రమంగా పెరుగుతున్నాయి. ఉక్కపోత ప్రారంభమైంది. శనివారం వాతావరణం పొడిగా ఉంటుంది. గాలిలో తేమ 70 శాతం ఉంది.

న్యూస్‌రీల్

ఎంపీ ఆదాలతో ఎమ్మెల్యేల భేటీ



ఎంపీ ఆదాలను మర్యాద పూర్వకంగా కలిసిన ఎమ్మెల్యేలు ప్రసన్నకుమార్‌రెడ్డి, అనిల్‌కుమార్‌యాదవ్

నెల్లూరు రూరల్‌: నెల్లూరు ఎంపీ, నెల్లూరు రూరల్‌ సమన్వయకర్త ఆదాల ప్రభాకర్‌రెడ్డిని ఆయన నివాసంలో శుక్రవారం నెల్లూరు నగర ఎమ్మెల్యే అనిల్‌కుమార్‌ యాదవ్, కోవూరు ఎమ్మెల్యే నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి మర్యాద పూర్వకంగా కలిశారు. పుష్పగుచ్ఛం అందజేసి అభినందించారు. రూరల్‌ నియోజకవర్గంలో వైఎస్సార్‌సీపీని మరింత బలోపేతం చేసే దిశగా చేపట్టాల్సిన చర్యలపై వారు చర్చించారు.

హెచ్‌ఎస్‌ఆర్‌పీ, రిఫ్లెక్టెడ్‌ టేపులు అమర్చుకోవాలి

నెల్లూరు (టౌన్‌): ఆంధ్రప్రదేశ్‌ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు మేరకు వాహనదారులందరూ విధిగా తమ వాహనాలకు హెచ్‌ఎస్‌ఆర్‌పీ నంబర్‌ ప్లేట్లు, రిఫ్లెక్టెడ్‌ టేపులు అమర్చుకోవాలని డీటీసీ చందర్‌ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. తనిఖీల సమయంలో వాహనాలకు హెచ్‌ఎస్‌ఆర్‌పీ నంబర్‌ ప్లేట్, రిఫ్లెక్టెడ్‌ టేపులు లేకుంటే జరిమానా విధించడంతో పాటు వాహనాలను స్వాధీనం చేసుకుంటామన్నారు.

ఏప్రిల్‌లో లోయర్, హయ్యర్‌ గ్రేడ్‌ పరీక్షలు

నెల్లూరు (టౌన్‌): టెక్నికల్‌ కోర్సుకు సంబంధించి డ్రాయింగ్, హ్యాండ్‌లూమ్, వీవింగ్, టైలరింగ్, ఎంబ్రాయిడరీ లోయర్, హయ్యర్‌ గ్రేడ్‌ పరీక్షలను ఏప్రిల్‌లో నిర్వహించనున్నట్లు డీఈఓ నారాయణరావు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. పరీక్షకు హాజరయ్యే అభ్యర్థులు తప్పనిసరిగా 7వ తరగతి ఉత్తీర్ణత సాధించడంతో పాటు సంబంధిత ట్రేడ్‌లో లోయర్‌ గ్రేడ్, తత్సమాన పరీక్ష పాసై ఉండాలని చెప్పారు. అభ్యర్థులు తమ దరఖాస్తులను ఆన్‌లైన్‌ వెబ్‌సైట్‌లో www.bre.ap.gov.inలో పూరించాలన్నారు. డ్రాయింగ్‌ (లోయర్‌ గ్రేడ్‌)కు రూ.100 , డ్రాయింగ్‌ హయ్యర్‌ గ్రేడ్‌కు రూ.150 , హ్యాండ్‌లూమ్‌ వీవింగ్‌ (లోయర్‌ గ్రేడ్‌)కు రూ.150, హ్యాండ్‌లూమ్‌ వీవింగ్‌ (హయ్యర్‌ గ్రేడ్‌)కు రూ.200, టైలరింగ్, ఎంబ్రాయిడరీ (లోయర్‌ గ్రేడ్‌)కు రూ.150, హయ్యర్‌ గ్రేడ్‌కు రూ. 200 ఫీజు చెల్లించాలన్నారు. ఈ నెల 25వ తేదీలోపు ఫీజు చెల్లించాలన్నారు. రూ.50 అపరాధ రుసుంతో వచ్చే నెల 3వ తేదీ వరకు, రూ.75 అపరాధ రుసుంతో వచ్చే నెల 10వ తేదీ వరకు అవకాశం ఉందన్నారు.

రూ.12 లక్షల ఆభరణాలు మాయం

నెల్లూరు(క్రైమ్‌): బంగారు ఆభరణాల విక్రయ దుకాణంలో రూ.12 లక్షల ఆభరణాలు మాయమైన ఘటన శుక్రవారం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. వివరాల్లోకి వెళ్లితే.. ఆచారివీధికి చెందిన సంగ్వీ రాజేష్‌ జైన్‌ తన ఇంటి వద్దనే బంగారు ఆభరణాల విక్రయదుకాణం నిర్వహిస్తున్నాడు. దుకాణంలో మధ్యపతివారివీధికి చెందిన పాయసం లోకేశ్, నగరానికి చెందిన దేవరాజ్‌ వెంకటేష్‌ మేనేజర్లు పనిచేస్తున్నారు. లోకేశ్‌ ప్రతి రోజు లాకర్ల నుంచి బంగారు ఆభరణాలను తీసుకువచ్చి దుకాణంలో డిస్‌ప్లేలో ఉంచి సాయంత్రం వాటిని తిరిగి లాకర్‌లో పెట్టే వాడు. ఈ నెల 9న రాజేష్‌జైన్‌ డిస్‌ప్లేలో ఉంచిన ఆభరణాలు పరిశీలించగా అందులో రూ.12 లక్షలు విలువ చేసే 238 గ్రాముల బంగారు ఆభరణాలు కనిపించలేదు. ఈ విషయమై ఆయన మేనేజర్లను ప్రశ్నించగా తమకు తెలియదని చెప్పారు. దీంతో యజమాని బంగారు ఆభరణాలు మాయంపై శుక్రవారం చిన్నబజారు ఇన్‌స్పెక్టర్‌ ఎ. సురేంద్రబాబుకు ఫిర్యాదు చేశారు. ఆభరణాలు మాయం వెనుక లోకేశ్‌ ప్రమేయం ఉన్నట్లు అనుమానంగా ఉందని ఫిర్యాదులో పేర్కొన్నారు. బాధిత యజమాని ఫిర్యాదు మేరకు ఇన్‌స్పెక్టర్‌ కేసు నమోదు చేశారు. అనుమానితుడిని అదుపులోకి తీసుకుని విచారిస్తున్నట్లు సమాచారం.

సోమశిలలో 65.883 టీఎంసీలు

సోమశిల: జలాశయంలో శుక్రవారం సాయంత్రానికి 65.883 టీఎంసీల నీరు నిల్వ ఉంది. పైతట్టు ప్రాంతాల నుంచి 1,379 క్యూసెక్కుల వరద ప్రవాహం వస్తోంది. పెన్నార్‌ డెల్టాకు 3,920, ఉత్తరకాలువకు 733, దక్షిణ కాలువకు 320, కండలేరుకు 50 క్యూసెక్కులు నీటిని విడుదల చేస్తున్నారు. సగటున 314 క్యూసెక్కుల నీరు ఆవిరవుతోంది.

మిస్సింగ్‌ మిస్టరీల ఛేదన

ఏళ్ల తరబడి అపరిష్కృతంగా ఉన్న మిస్సింగ్‌ కేసుల మిస్టరీలను ఏహెచ్‌టీయూ (యాంటీ హ్యూమన్‌ ట్రాఫికింగ్‌ యూనిట్‌) బృందం ఛేదిస్తోంది. కుటుంబ సభ్యులతో విభేదాలు, ఆర్థిక సమస్యలు, ప్రేమపేరుతో అదృశ్యమైన కేసుల్లోని కుటుంబ సభ్యులను రక్తసంబంధీకుల చెంతకు చేర్చడంలో జిల్లా పోలీస్‌ యంత్రాంగం సఫలీకృతమవుతోంది. ఈ బృందం సివిల్‌ పోలీసులను సమన్వయం చేసుకుంటూ జిల్లాలో మానవ అక్రమరవాణా నిరోధానికి చర్యలు చేపట్టింది. అక్రమ రవాణాకు పాల్పడే ముఠాలను గుర్తించి వారి చెర నుంచి బాధితుల సంరక్షిస్తోంది.

- ఏహెచ్‌టీయూతో దర్యాప్తు వేగవంతం
- 10 నెలల్లో 14 కేసుల్లో 19 మందిని సంరక్షించిన వైనం
- స్థానిక పోలీసులతో మరో 28 కేసులు
- బాధిత కుటుంబాల్లో ఆనందం



పొదలకూరుకు చెందిన ఓ మహిళ తన ఇద్దరు పిల్లలతో కలిసి 2012 అక్టోబర్‌లో ఇల్లు విడిచి వెళ్లిపోయింది. అదే నెల 24న పొదలకూరు పోలీసులు మిస్సింగ్‌ కేసు నమోదు చేశారు. వారి కోసం గాలించినా ఫలితం లేకపోవడంతో కేసు ముందుకు సాగలేదు. ఈ కేసు దర్యాప్తును చేపట్టిన ఏహెచ్‌టీయూ బృందానికి ఎలాంటి ఆధారాలు లభ్యం కాకపోవడంతో కేసులో పురోగతి లేదు. పూర్తి స్థాయిలో సాంకేతికతను వినియోగించి ఆమెకు సంబంధించిన రేషన్‌ కార్డును సాధించారు. దాని ఆధారంగా దాదాపు 10 ఏళ్ల తర్వాత గతేడాది జూలైలో వీరు గుంటూరులో ఉన్నట్లు గుర్తించారు. వారిని కుటుంబ సభ్యులకు అప్పగించారు.




సీతారామపురం పోలీసుస్టేషన్‌ పరిధిలో 2019లో బాలిక తప్పిపోయింది. జూన్‌లో ఆమె బెంగళూరులో ఉన్నట్లు గుర్తించిన ఏహెచ్‌టీయూ బృందం అక్కడికి వెళ్లింది. ఆమెను క్షేమంగా నెల్లూరుకు తీసుకువచ్చి తల్లిదండ్రులకు అప్పగించారు. నెల్లూరు నగరంలోని సంతపేట, బాలాజీనగర్, జలదంకి, తోటపల్లిగూడూరు, నెల్లూరు రూరల్, వెంకటాచల సత్రం, సైదాపురం పోలీసుస్టేషన్లలో ఆచూకీ కనపడకుండా పోయిన వారిని రక్షించి ఆయా కుటుంబాలకు అప్పగించారు.



ఇందుకూరుపేటలో తప్పిపోయిన మహిళ, బాలుడ్ని సంరక్షించిన దృశ్యం (ఫైల్‌)

జిల్లాలో మిస్సింగ్‌ కేసులు			
సంవత్సరం	నమోదైన కేసులు	ఛేదించిన కేసులు	పెండింగ్‌
2021	534	504	30
2022	694	661	33
2023	50	28	22



నెల్లూరు (క్రైమ్‌): తల్లిదండ్రులు మందలించారని పిల్లలు, భార్యాభర్తల మధ్య విభేదాల నేపథ్యంలో భార్యా, పిల్లలు, ప్రేమవ్యవహారాలతో యువతి, యువకులు, ఇతర కారణాలతో కుటుంబ పెద్దలు.. ఇలా క్షణికావేశంతో కుటుంబ సభ్యులకు దూరంగా వెళ్లిపోతున్నారు. తమ ఆనవాళ్లు తెలియకుండా కొత్త ప్రదేశాల్లో కాలం గడుపుతున్నారు. కన్నబిడ్డలు, కట్టుకున్నోళ్లు అదృశ్యమైతే వారి కోసం కళ్లు కాయలు కాసేలా ఎదురు చూసిచూసీ ఆశలు వదిలేసుకున్న కుటుంబాలు అనేకం ఉన్నాయి. ఏళ్ల తరబడి ఆచూకీ లభించక పోయిన కేసులను ఛేదించేందుకు, మానవ అక్రమ రవాణాను పూర్తిస్థాయిలో అరికట్టేందుకు రాష్ట్ర ప్రభుత్వం చర్యలు చేపట్టింది. అన్ని జిల్లా కేంద్రాల్లో యాంటీ హ్యూమన్‌ ట్రాఫికింగ్‌ యూనిట్‌ (ఏహెచ్‌టీయూ)లను ఏర్పాటు చేయాలని ఆదేశించింది. ఈ క్రమంలో ఎస్పీ సీహెచ్‌ విజయారావు గతేడాది ఏప్రిల్‌ 1న దిశ ప్రాంగణంలో సీఐ, ఇద్దరు ఎస్‌ఐలు, ఇద్దరు హెచ్‌సీలు, ఒక పీసీతో ఏహెచ్‌టీయూను ఏర్పాటు చేశారు.

అదృశ్యం వెనుక.. అనేక కారణాలు

పోలీసులశాఖ లెక్కల ప్రకారం జిల్లాలో రోజుకు సగటున ముగ్గురు నుంచి నలుగురు వ్యక్తులు వివిధ కారణాలతో అదృశ్యమవుతున్నారు. ప్రధానంగా 15 నుంచి 22 ఏళ్లలోపు అబ్బాయిలు, అమ్మాయిలు అదృశ్యమైన కేసుల్లో అధిక శాతం ప్రేమవ్యవహారాలు ఉండగా, మరికొంత మంది అందుకు భిన్నంగా చెబుతున్నారు. ఇంట్లో అన్నింటికి అనుమానిస్తున్నారని, అకారణంగా తిడుతున్నారని బయటకు వచ్చేసినట్లు వివరిస్తున్నారు. మరికొందరు టీనేజీ మిత్రులతో కలువనీయయకపోవడం, అడిగిన డబ్బు ఇవ్వకపోవడం, సెల్‌ఫోన్‌ వాడకంపై నియంత్రణ వంటి కారణాలు చెబుతున్నారు. ఇంటికి దూరంగా వారు కోరుకున్న ప్రపంచంలో విహరిద్దామని వెళ్లి ఆ తర్వాత చిక్కుల్లో పడి తిరిగి ఇంటికి వచ్చేస్తున్న వారు ఇంకొందరు. 25 నుంచి 40 ఏళ్లలోపు మహిళల విషయానికొస్తే కుటుంబ సభ్యుల ఒత్తిడి అధికమని, తమ అభిప్రాయాలకు విలువ ఇవ్వడం లేదని బయటకు వచ్చేస్తున్నారు. ప్రధానంగా 40 నుంచి 50 ఏళ్లలోపు వారు అనారోగ్యం, ఆర్థిక సమస్యలే కారణమని తెలుస్తోంది. వెంటాడుతోన్న అనారోగ్యం, మతిస్థిమితం సరిగా లేకపోవడంతో బయటకు వచ్చి తప్పిపోతున్నారని పోలీసుల దర్యాప్తులో తేలింది. అదృశ్యమవుతున్న వారిలో 85 శాతానికిపైగా తిరిగి ఇళ్లకు చేరుకుంటుండగా మిగిలిన 15 శాతం మంది ఆచూకీ పత్తాలేకుండా పోతోంది. ఇలాంటి కేసుల ఛేదన బాధ్యతను ఎస్పీ ఏహెచ్‌టీయూ బృందానికి అప్పగించారు.

విస్తృతంగా అవగాహన

యాంటీ హ్యూమన్‌ ట్రాఫికింగ్‌పై జిల్లా వ్యాప్తంగా విద్యాసంస్థలు, అపార్ట్‌మెంట్‌లు, పార్కులు, బహిరంగ ప్రదేశాల్లో ఏహెచ్‌టియు బృందం అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తూ ప్రజలను చైతన్యవంతులను చేస్తోంది. స్వచ్ఛంద సంస్థలను సైతం అవగాహన కార్యక్రమాల్లో భాగస్వామ్యులను చేస్తోంది. కౌమార, యవ్వన దశలో యువతలో ఆలోచనలు వేగంగా ఉంటాయి. తమకిష్టమైన రీతిలో ఉండాలని ప్రయత్నిస్తారు. సహచరులతో పోల్చుకుని వారి వలే విలాసవంతమైన జీవనం సాగించాలనుకుంటారు. అధిక సమయాన్ని సెల్‌ఫోన్, మిత్రులతో గడపాలనుకుంటారు. ఇలాంటి సమయాల్లో తల్లిదండ్రులు వారి ఆలోచలను అర్థం చేసుకోవడంతో పాటు వారి అభిప్రాయాలను గౌరవించాలి. వారికి ఏది మంచి, ఏది చెడు అనే విషయాలను వివరించాలి. వారి ఇష్టాఇష్టాలను గౌరవించి వారు ఇష్టమైన రంగంలో రాణించేందుకు ప్రోత్సహించాలని సూచిస్తున్నారు. అక్రమ రవాణా జరుగుతున్నట్లు గుర్తిస్తే డయల్‌ 100, చైల్డ్‌ లైన్‌ 1098, ఉమెన్‌ హెల్ప్‌లైన్‌ 181కు సమాచారం అందించాలని సూచిస్తున్నారు.

సాంకేతిక పరిజ్ఞానానికి దొరకని కేసులను సైతం..

గడిచిన దశాబ్ద కాలం నాటి కేసులను సైతం ఛేదించడంలో ఏహెచ్‌టీయూ బృందం సఫలీకృతం అయింది. సాంకేతిక పరిజ్ఞానానికి దొరకని కేసులను ఛాలెంజ్‌గా తీసుకుని ఛేదించి వారిని సంరక్షించి కుటుంబ సభ్యులకు చెంతకు చేర్చి వారిలో ఆనందాన్ని నింపుతున్నారు. ఎస్పీ ఆదేశాలతో జిలా ఏహెచ్‌టీయూ ఇన్‌చార్జ్‌ ఇన్‌స్పెక్టర్‌ ఎస్‌.రామారావు పర్యవేక్షణలో ఎస్‌ఐలు పి.విజయశ్రీనివాస్, కె.బ్రహ్మయ్య, హెడ్‌కానిస్టేబుల్స్‌ వై. శ్రీహరి, కె. ప్రసాద్, కానిస్టేబుల్‌ టీవీఎస్‌ రాంబాబు బృందం సాంకేతికత, అందివచ్చిన ప్రతి విషయాన్ని పరిగణలోకి తీసుకుని కేసులను ఛేదిస్తోంది. గతేడాది మేలో 55 కేసులు అప్పగించగా 14 కేసుల్లో 19 మందిని ఏహెచ్‌టీయూ బృందం సంరక్షించింది. 28 కేసులను స్థానిక పోలీసుల సహకారంతో ఛేదించి బాధిత కుటుంబ సభ్యులకు అప్పగిస్తున్నారు. 13 కేసుల్లో దర్యాప్తు కొనసాగుతోంది. మిగతా కేసుల్లో త్వరలోనే వారి ఆచూకీని గుర్తించి బాధిత కుటుంబ సభ్యులకు అప్పగిస్తామని ఏహెచ్‌టీయూ అధికారులు తెలిపారు. మరో వైపు ఐసీడీఎస్, ఐసీపీఎస్‌లతో కలిసి ఆపరేషన్‌ ముస్కాన్‌ పేరిట వ్యాపార సంస్థల్లో పనులు చేస్తున్న 12 మంది బాలురును, ఒక బాలికను సంరక్షించి వారి తల్లిదండ్రులకు అప్పగించారు.

మిస్సింగ్‌ కేసులపై ప్రత్యేక దృష్టి



మిస్సింగ్‌ కేసులపై ప్రత్యేక దృష్టి సారించాం. ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి గాలింపు చర్యలు చేపడుతున్నాం. సైబర్, ఐటీ కోర్‌ సిబ్బంది సహకారంతో సీసీటీఎన్‌ఎస్‌ (ఐసీజేఎస్, ఐటీఎస్‌ఎస్‌ఓ) తదితర సాంకేతికత ఆధారం, సేకరించిన సమాచారంతో మిస్సింగ్‌ అయిన వారిని గుర్తించి వారి కుటుంబాలకు అగిస్తున్నాం. జిల్లాలో అపరిష్కృతంగాఉన్న ఎన్నో కేసులను ఏహెచ్‌టీయూ బృందం ఛేదించింది. మిస్సింగ్‌ కేసుల్లో క్షణికావేశంతో ఇంటి నుంచి బయటకు వెళ్లిపోతున్నారు.

– సీహెచ్‌ విజయారావు, ఎస్పీ


ఇందుకూరుపేటకు చెందిన ఓ వివాహిత తన కుమారుడితో కలిసి ఇంటి నుంచి అదృశ్యమైంది. 2015 జూలైలో ఇందుకూరుపేట పోలీసులు మిస్సింగ్‌ కేసు నమోదు చేశారు. అప్పటి నుంచి ఆమె జాడ తెలియరాలేదు. సాంకేతికత ఆధారంగా ఏహెచ్‌టీయూ బృందం గతేడాది జూన్‌లో వీరు రేణిగుంటలో ఉన్నట్లు గుర్తించి కుటుంబ సభ్యులకు అప్పగించారు.

నెల్లూరు బుజబుజనెల్లూరు అంబేడ్కర్‌నగర్‌కు చెందిన ఓ వ్యక్తి 2018 ఏప్రిల్‌లో అదృశ్యమయ్యాడు. అదే నెలలో వేదాయపాళెం పోలీసులు కేసు నమోదు చేశారు. కేసులో దర్యాప్తు ముందుకు సాగలేదు. ఏహెచ్‌టీయూ బృందం పక్కాగా సమాచారాన్ని సేకరించి అతను చెన్నై మహాబలిపురంలో ఉన్నట్లు గుర్తించి గతేడాది డిసెంబర్‌లో అతన్ని కుటుంబ సభ్యులకు అప్పగించారు.

పొదలకూరు మండలం బ్రాహ్మణపల్లికి చెందిన ఓ బాలుడు 2018 ఏప్రిల్‌లో అదృశ్యమయ్యాడు. కేసు విచారణ ముందుకు సాగలేదు. ఏహెచ్‌టీయూ బృందం బాలుడి కుటుంబ నేపథ్యం, బంధువుల పూర్వాపరాలు సేకరించారు. ఆ ఆధారాలు చేసుకుని గతేడాది అక్టోబర్‌లో మనుబోలు మండలం గొట్లపాళెంలో బాలుడ్ని గుర్తించి కుటుంబ సభ్యుల చెంతకు చేర్చారు.

వేడెక్కిన ఎమ్మెల్సీ ఎన్నికలు

జిల్లాలో ఎమ్మెల్సీ ఎన్నికల రాజకీయం వేడెక్కింది. గ్రాడ్యుయేట్, టీచర్స్‌ ఎమ్మెల్సీ స్థానాలకు వైఎస్సార్‌సీపీ తరఫున అభ్యర్థులు పోటీ పడుతుండగా, టీడీపీ తరఫున కేవలం పట్టభద్రుల ఎమ్మెల్సీ స్థానానికే పోటీ చేస్తుండగా, పీడీఎఫ్‌ తరఫున గ్రాడ్యుయేట్, టీచర్స్‌ ఎమ్మెల్సీ స్థానాలకు పోటీ చేస్తున్నారు. వైఎస్సార్‌సీపీ మద్దతుదారుల విజయం నల్లేరుపై నడకే అయినా, రాజకీయ మనుగడకు కొన ఊపిరితో కొట్టుమిట్టాడుతున్న టీడీపీకి, సిటింగ్‌ స్థానాన్ని కాపాడుకునేందుకు పీడీఎఫ్‌కు ఈ ఎన్నికలు ప్రతిష్టాత్మకంగా మారాయి. స్థానిక సంస్థల ఎమ్మెల్సీ అభ్యర్థులను ఏ పార్టీ కూడా ఇంకా ప్రకటించలేదు.



- జిల్లాలో గ్రాడ్యుయేట్, టీచర్స్, స్థానిక సంస్థల ఎమ్మెల్సీ స్థానాలు
- షెడ్యూల్‌ విడుదలతో ఊపందుకున్న ప్రచారం
- వైఎస్సార్‌సీపీ మద్దతు అభ్యర్థుల దూకుడు
- ఈ ఎన్నికల్లో పురుష ఓటర్లే కీలకం
- స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఏకగ్రీవమయ్యే ఛాన్స్‌

సాక్షి ప్రతినిధి, నెల్లూరు: ప్రకాశం, నెల్లూరు, చిత్తూరు జిల్లాల పరిధిలోని తూర్పురాయలసీమ నియోజకవర్గంలో గ్రాడ్యుయేట్, టీచర్స్‌ ఎమ్మెల్సీ ఎన్నికల ప్రక్రియకు సంబంధించి కేంద్ర ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు జిల్లాల అధికారులు కొన్ని నెలలుగా కసరత్తు చేశారు. తాజాగా ఎన్నికలకు షెడ్యూల్‌ విడుదల చేయడంతో జిల్లాలో రాజకీయం వేడెక్కింది. గ్రాడ్యుయేట్, టీచర్స్‌ ఎమ్మెల్సీ స్థానాలతో పాటు స్థానిక సంస్థల ఎమ్మెల్సీ స్థానానికి కూడా ఈ నెల 16 నోటిఫికేషన్‌ విడుదల చేయనుంది. మార్చి 13న పోలింగ్‌ ప్రక్రియ, 16న ఓట్ల లెక్కింపు ఉంటుంది. ప్రధాన రాజకీయ పార్టీలు తమ అభ్యర్థులను ప్రకటించడంతో ఇప్పటికే వారు విస్తృతంగా ప్రచారం చేసుకుంటున్నారు. మూడు నెలలుగా జిల్లాలో ఓట్ల చేర్పులు, మార్పులు ప్రక్రియ వేగవంతంగా సాగి జాబితా సిద్ధమైంది. తాజాగా ఓట్ల జాబితా విడుదల చేయడంతో ఓటర్లను ప్రసన్నం చేసుకునేందుకు అభ్యర్థులు తలమునకలవుతున్నారు.

ఏ పార్టీ తరఫున ఎవరంటే..

పీడీఎఫ్‌ తరఫున ప్రస్తుతం గ్రాడ్యుయేట్‌ ఎమ్మెల్సీగా యండవల్లి శ్రీనివాసులురెడ్డి, టీచర్స్‌ ఎమ్మెల్సీగా విఠపు బాలసుబ్రహ్మణ్యం కొనసాగుతున్నారు. తాజాగా జరగబోయే ఎన్నికలకు ఈ దఫా గట్టి పోటీ ఏర్పడింది. అధికార పార్టీ వైఎస్సార్‌సీపీతో పాటు టీడీపీ, పీడీఎఫ్, ఇండిపెండెంట్‌ అభ్యర్థులు పోటీ చేయడానికి తహతహలాడుతున్నారు. వైఎస్సార్‌సీపీ తరఫున పట్టభద్రుల అభ్యర్థిగా పేర్నాటి శ్యాంప్రసాద్‌రెడ్డి, టీచర్స్‌ అభ్యర్థిగా పర్వతరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డిని ప్రకటించింది. ఇక టీడీపీ కేవలం పట్టభద్రుల ఎమ్మెల్సీ స్థానానికి కందుకూరుకు చెందిన కంచర్ల శ్రీకాంత్‌ అభ్యర్థిగా ప్రకటించింది. పీడీఎఫ్‌ తరఫున సిటింగ్‌ ఎమ్మెల్సీలకు రిటైర్డ్‌మెంట్‌ ప్రకటించింది. కొత్తగా ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అభ్యర్థిగా పి.బాబురెడ్డి, పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థిగా ప్రకాశం జిల్లాకు చెందిన మీగడ వెంకటేశ్వరరెడ్డిని బరిలో నిలవబోతున్నారు. వీరితో పాటు పలు ఉపాధ్యాయ సంఘాల మద్దతుతో టీచర్స్‌ ఎమ్మెల్సీ అభ్యర్థిగా జిల్లాకు చెందిన ఎల్‌సీ రమణారెడ్డి కూడా బరిలోకి దిగుతున్నట్లు ప్రచారం చేసుకుంటున్నారు.

పురుష ఓటర్లే కీలకం

తూర్పు రాయలసీయ పట్టభద్రులు, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో పురుష ఓటర్లే కీలకంగా ఉన్నారు. తాజాగా విడుదల చేసిన ఓటర్ల జాబితాను పరిశీలిస్తే మహిళల కంటే పురుషుల ఓటర్లే అధికంగా ఉన్నారు. పట్టభద్రుల నియోజకవర్గ పరిధిలోని 76 పోలింగ్‌ కేంద్రాల్లో మొత్తం ఓటర్లు 1,03,969 మంది ఉంగా, ఇందులో పురుష ఓటర్లు 65,985 మంది, మహిళలు 37,978 మంది ఉన్నారు. మహిళల ఓటర్ల కంటే పురుషులే 45 శాతం అధికంగా ఉన్నారు. టీచర్స్‌ నియోజకవర్గ పరిధిలోని 36 పోలింగ్‌ కేంద్రాల్లో 7,713 ఓటర్లకు పురుష ఓటర్లు 4,674 మంది ఉండగా, మహిళలు 3,039 మంది ఉన్నారు. టీచర్స్‌ నియోజకవర్గంలో కూడా పురుష ఓటర్లే కీలకంగా మారాయి.

స్థానిక సంస్థల ఎమ్మెల్సీ వైఎస్సార్‌సీపీ ఖాతాకే!

స్థానిక సంస్థల ఎమ్మెల్సీ స్థానం వైఎస్సార్‌సీపీ ఖాతాలో జమ కానుంది. ఈ ఎమ్మెల్సీకి పోటీ కూడా ఉండే అవకాశం లేదని, ఏకగ్రీవయ్యే అవకాశాలు ఉన్నాయని రాజకీయ విశ్లేషకులు చెబుతున్నారు. ఉమ్మడి నెల్లూరు జిల్లాలో పది నియోజకవర్గాల్లో గత స్థానిక సంస్థల ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ విజయదుందుబి మోగించింది. ఓ వైపు ప్రజాసంక్షేమ పథకాల అమలుతో ప్రజారంజక పాలన సాగిస్తుండడంతో గతంలో జరిగిన స్థానిక సంస్థల ఎన్నికల్లో వార్‌గా వన్‌సైడ్‌ సాగింది. జిల్లాలో 554 ఎంపీటీసీ స్థానాలకు ఏడు ఖాళీలుండగా మిగిలిన అన్నింటిని కూడా వైఎస్సార్‌సీపీ క్లీన్‌ స్వీప్‌ చేసింది. ఇక నెల్లూరు నగరపాలక సంస్థతో పాటు మరో ఐదు మున్సిపాల్టీలు కూడా వైఎస్సార్‌సీపీ ఖాతాలోనే ఉన్నాయి. అల్లూరు, కావలి, కందుకూరులో ఎన్నికలు జరగలేదు. ప్రస్తుతం 762 ఓటర్లు ఉన్నారు. దీంతో స్థానిక సంస్థల ఎమ్మెల్సీ వైఎస్సార్‌సీపీ ఖాతాలో జమ కానుంది. ఇతర రాజకీయ పార్టీలు అభ్యర్థిని పెట్టే సాహసం కూడా చేయలేరు.

ప్రచారంలో దూకుడు

గ్రాడ్యుయేట్, టీచర్స్‌ ఎమ్మెల్సీల వైఎస్సార్‌సీపీ అభ్యర్థులు ప్రచారంలో దూసుకుపోతున్నారు. గ్రాడ్యుయేట్‌ అభ్యర్థిగా పేర్నాటి శ్యాంప్రసాద్‌రెడ్డి, టీచర్స్‌ అభ్యర్థిగా చంద్రశేఖర్‌రెడ్డి బరిలో ఉన్నారు. ఆ ఇద్దరు కూడా మూడు జిల్లాల పరిధిలో విస్తృతమైన పరిచయాలు కలిగి ఉండడంతో పాటు వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు వారి విజయానికి దోహద పడనున్నాయి. ఇప్పటికే నియోజకవర్గంలోని ఓటర్లతో మమేకమయ్యారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఇప్పటికే లక్షలాది మందికి ఉద్యోగావకాశాలు కల్పించింది. ఇవన్నీ కూడా వైఎస్సార్‌సీపీ మద్దతు అభ్యర్థుల విజయానికి కలిసొచ్చే అంశాలు.

ఓటు వివరాలు తెలుసుకోవడం ఇలా

నెల్లూరు (అర్బన్‌): వచ్చే నెలలో జరగనున్న ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించి పట్టభద్రుల, ఉపాధ్యాయ ఓటర్లుగా నమోదైన వారు తాము ఓటేసేందుకు సంబంధించిన పోలింగ్‌స్టేషన్, నంబర్, పోలింగ్‌ లొకేషన్, ఓటరు వరుస నంబర్‌ తెలుసుకునేలా ఎన్నికల సంఘం ఆన్‌లైన్‌లో ఏర్పాట్లు చేసింది.

- సీఈఓ ఆంధ్ర.ఎన్‌ఐసీ.ఇన్‌ వెబ్‌ సైట్‌ ఓపెన్‌ చేయాలి. సెర్చ్‌ యువర్‌ నేమ్‌పై కర్సర్‌ ఉంచాలి.
- కౌన్సిల్‌ నియోజకవర్గంపై కర్సర్‌ ఉంచాలి. నో యువర్‌ పోలింగ్‌ స్టేషన్‌ క్లిక్‌ చేయాలి.
- గ్రాడ్యుయేట్/టీచర్స్‌ అవసరమైన దానిని క్లిక్‌ చేయాలి.
- నియోజకవర్గం సెలక్ట్‌ గడిలో డ్రాప్‌ డౌన్‌ బాక్స్‌లో ప్రకాశం, నెల్లూరు, చిత్తూరుని సెలెక్ట్‌ చేయాలి.
- ఏపీపీ ఐడీలో అప్లికేషన్‌ రిజిస్ట్రేషన్‌ నంబర్‌ ఉంటే నమోదు చేయాలి. ఏపీపీఐడీ లేనిచో నేమ్‌ దగ్గర పూర్తి పేరును స్పెల్లింగ్‌ మిస్టేక్స్‌ లేకుండా టైప్‌ చేయాలి.
- తర్వాత సెర్చ్‌ బటన్‌ను క్లిక్‌ చేయాలి.
- సంబంధిత ఓటరు వివరాలు (జిల్లా పేరు, పోలింగ్‌ స్టేషన్‌ నంబర్, పోలింగ్‌ స్టేషన్‌ లొకేషన్, ఓటరు వరుస నంబర్‌) చూడొచ్చు. వీటిని సంబంధిత ఓటరు పోలింగ్‌ రోజు సులభంగా కేంద్రానికి వెళ్లి ఓటు వేయొచ్చు.
- వీవ్‌ పోలింగ్‌ స్టేషన్‌పై క్లిక్‌ చేసినచో వివరాలు వస్తాయి. ప్రింట్‌ కూడా తీసుకోవచ్చు.

ఫోన్‌ పోతే.. మెసేజ్‌ పెట్టు

- మొబైల్‌ హంట్‌ సేవలు ప్రారంభం
- 91543 05600కు మెసేజ్‌ పంపితే రంగంలోకి సిబ్బంది
- తక్షణమే సెల్‌ఫోన్‌ రికవరీకి పోలీసుల చర్యలు

నెల్లూరు (క్రైమ్‌): మీ సెల్‌ఫోన్‌ పోయిందా.. ఎవరైనా అపహరించారా.. అయితే మీరు పోలీసుస్టేషన్‌కు వెళ్లి ఫిర్యాదు చేయాల్సిన అవసరం లేదు. వాట్సాప్‌ ద్వారా పోయిన మీ మొబైల్‌ వివరాలతో ఫిర్యాదు చేస్తే చాలు. మొబైల్‌ హంట్‌ పేరిట పోలీస్‌ సిబ్బంది రంగంలోకి దిగి సెల్‌ఫోను రికవరీకి చర్యలు తీసుకుంటారు. ఎస్పీ సీహెచ్‌ విజయారావు మొబైల్‌ హంట్‌ సేవలను శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ ప్రస్తుతం సెల్‌ఫోన్‌ లేనిదే క్షణం గడవని పరిస్థితిగా మారింది. వృత్తిరీత్యా, వ్యక్తిగత పనుల్లో పడి సెల్‌ఫోన్‌ మర్చిపోవడం, పోగొట్టుకోవడం జరుగుతుందన్నారు. అందులో నిక్షిప్తం చేసిన విలువైన సమాచారం, వ్యక్తిగత, కుటుంబ ఫొటోలు. వీడియోలు, డేటా అసాంఘిక వ్యక్తుల చేతిలో పడితే అది మరింత ప్రమాదకరమన్నారు. అయితే ఇకపై ఫోన్‌ పోగొట్టుకున్న వారెవరూ చింతించాల్సిన అవసరం లేదని, వారి కోసం మొబైల్‌ హంట్‌ సేవలను అందుబాటులోకి తీసుకువచ్చామన్నారు. తద్వారా పోగొట్టుకున్న సెల్‌ఫోన్లను త్వరితగతిన గుర్తించి బాధితులకు అందజేస్తామన్నారు. మొబైల్‌ హంట్‌ సేవలను ప్రజలందరూ వినియోగించుకోవాలన్నారు. సెల్‌ఫోన్‌ పోగొట్టుకున్న వారు ముందుగా మొబైల్‌ నంబర్‌ 91543 05600కు వాట్సాప్‌ ద్వారా మెసేజ్‌ పంపాలి. వెంటనే జిల్లా పోలీసు పేరుతో మీ వివరాల కోసం పంపిన లింక్‌ను క్లిక్‌ చేయాలి. ఆ లింక్‌లో గూగుల్‌ ఫారం ఓపెన్‌ చేసి ఫిర్యాదుదారుడి పేరు, చిరునామా, చోరీ లేదా పోయిన తేదీ, సమయం, పోయిన స్థలం, ఫోన్‌ మోడల్, కంపెనీ, రంగు, ఐఎంఈఐ నంబర్, ఈ మెయిల్‌ ఐడీ, ఫిర్యాదుదారుడి ప్రభుత్వ గుర్తింపు పత్రం (ఆధార్/డ్రైవింగ్‌ లైసెన్సు), పోయిన ఫోన్‌లో ఉపయోగించిన నంబర్, ఫిర్యాదుదారుడి పోలీసుస్టేషన్‌ పరిధి తదితర వివరాలను నమోదు చేసిన వెంటనే ఫిర్యాదు నమోదవుతుంది. ఐటీ కోర్‌ సిబ్బంది వారి వద్దనున్న సాంకేతిక పరిజ్ఞానంతో మొబైల్‌ను ట్రేస్‌ చేస్తారు. ఐఎంఈఐ కోడ్, సెల్‌ఫోన్‌ సిగ్నల్స్‌ ఆధారంగా పోయిన ఫోన్‌ ప్రస్తుతం ఎక్కడుందో ఆ ప్రాంతాన్ని త్వరితగతిన కనిపెట్టేస్తారు.

విద్యుత్ ఆదాతో భవితకు భరోసా

విద్యుత్ వినియోగం రోజురోజుకు పెరుగుతోంది. అందుకు తగ్గట్లుగా విద్యుత్ సంస్థలు కూడా వినియోగదారులకు కోతలు లేకుండా సరఫరా చేస్తున్నాయి. అదే సమయంలో విద్యుత్‌ను పొదుపుగా వాడడంపై చైతన్యం తెచ్చేందుకు అధికారులు కృషి చేస్తున్నారు. తక్కువ విద్యుత్‌తో ఎక్కువ ఉపయోగం పొందేలా నూతన ప్రక్రియకు శ్రీకారం చుట్టారు. ఒక యూనిట్ విద్యుత్‌ను ఆదా చేస్తే రెండు యూనిట్ల విద్యుత్‌ను ఉత్పత్తి చేయడమే అనే నినాదంతో అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు.

- వేసవి కోసం ముందస్తు ప్రణాళిక
- భవిష్యత్ అవసరాల దృష్ట్యా ఆదాకు చర్యలు
- వినియోగదారుల్లో చైతన్యం కలిగించేలా కార్యక్రమాలు



కేటగిరీ వారీగా	మొత్తం సర్వీసులు
గృహ సర్వీసులు	8,99,151
వ్యాపార సర్వీసులు (వాణిజ్యం)	97,411
పరిశ్రమల సర్వీసులు (ఎల్‌టీ)	4,240
పరిశ్రమల సర్వీసులు (హెచ్‌టీ)	814
దేవాలయాలు, చర్చిలు, మసీదులు	25,353
వ్యవసాయ సర్వీసులు (అగ్రికల్చర్)	1,85,080
ఆక్వా సర్వీసులు	25,380
మొత్తం సర్వీసులు	12,37,429

నెల్లూరు(వీఆర్సీసెంటర్): ఉమ్మడి నెల్లూరు జిల్లాలో విద్యుత్ వినియోగం నెలకు 14 మిలియన్ యూనిట్లు ఉంటుంది. అదే వేసవి కాలంలో అయితే ఆ సంఖ్య 16 మిలియన్ యూనిట్లకు చేరుతుంది. వేసవిలో విద్యుత్ వినియోగం పెరిగినప్పటికీ అందుకు తగ్గట్టుగా అప్రకటిత విద్యుత్ కోతలు లేకుండా విద్యుత్ సంస్థలు చర్యలు తీసుకుంటున్నాయి.

జగనన్న కాలనీల్లో..

జగనన్న కాలనీల్లో గృహాలకు ఇంధన పొదుపు పాటించేందుకు విద్యుత్ శాఖ నడుం బిగించింది. రాష్ట్ర ప్రభుత్వం, ఆ శాఖ కలిసి ఇండో–స్విస్ సాంకేతికత ద్వారా ఇళ్లలో 2 డిగ్రీల ఉష్ణోగ్రతను తగ్గించేలా, థర్మల్ కంఫర్ట్ పెరిగి ఇల్లు చల్లదనం ఉండేలా సాంకేతికను వినియోగించుకుంటోంది. ఈ పరిజ్ఞానంతో మామూలు ఇళ్లలో వాడే విద్యుత్ వినియోగంతోనే మరింత ఎక్కువ వెలుగులు ఉండేలా నూతన టెక్నాలజీని వాడనున్నారు. ఇందుకోసం కేంద్ర ప్రభుత్వ సంస్థ 'బ్యూరో ఆఫ్ ఎనర్జీ ఎఫిషియన్సీ' (బీఈఈ) సహకారం తీసుకుంటోంది. దీని ద్వారా జగనన్న కాలనీలోని ఇళ్లలో 20 శాతం విద్యుత్ బిల్లులు ఆదా అయ్యే అవకాశం ఉంది.

ఇలా ఆదా చేయొచ్చు

వినియోదారులు కూడా స్వయంగా విద్యుత్‌ను ఉత్పత్తి చేయొచ్చు. అదెలా అంటే ఒక యూనిట్ విద్యుత్‌ను ఆదా చేస్తే రెండు యూనిట్ల విద్యుత్‌ను ఉత్పత్తి చేసినట్టేనని గ్రహించాలి. ప్రధానంగా అవసరం లేని సమయాల్లో విద్యుత్ పరికరాలను వినియోగించకూడదు. ఫ్రిజ్, ఏసీ, వాషింగ్ మెషీన్, టీవీ, ఫ్యాన్, మిక్సీ, వాటర్ హీటర్, మోటార్లు వంటి పరికరాలను 5 స్టార్స్ రేటింగ్స్ కలిగిన వాటినే వాడాలి. ఇళ్లలో వాడే సాధారణ బల్బుల స్థానంలో ఎల్‌ఈడీ బల్బులు వినియోగించడం ద్వారా చాలా విద్యుత్‌ను ఆదా చేయొచ్చు. అదేవిధంగా రైతులు ఐఎస్ఐ మార్క్ కలిగిన విద్యుత్ మోటార్లను వాడితే విద్యుత్ ఎంతో ఆదా అవుతుంది. అనవసర సమయాల్లో ఇళ్లలో, ప్రభుత్వ, ప్రైవేట్ కార్యాలయాల్లో ఫ్యాన్లు, ఏసీ, లైట్లు లాంటి వాటిని ఆపి వేయటం, పగటిపూట లైట్లు వేయకుండా సూర్యకాంతితో వచ్చేలా చూసుకోవడం ద్వారా విద్యుత్‌ను ఆదా చేయవచ్చు.

వినియోగదారుల భాగస్వామ్యం

విద్యుత్ పొదుపులో వినియోగదారులను భాగస్వామ్యం చేసేలా రాష్ట్ర ప్రభుత్వం, విద్యుత్ సంస్థలు చర్యలు తీసుకుంటున్నాయి. విద్యుత్ వనరులను ఆదా చేసుకుని పొదుపుగా వాడాల్సిన అవసరం ఉందని గ్రహించిన కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రతి ఏడాది డిసెంబర్ 14వ తేదీ నుంచి 20వ తేదీ వరకు 'జాతీయ ఇంధన పొదుపు' వారోత్సవాలను నిర్వహిస్తూ విద్యుత్ వినియోగం, ఆదాపై అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నాయి. ఈ కార్యక్రమంలో విద్యుత్ సంస్థల ద్వారా ఇంధన పొదుపుపై ప్రతిఒక్కరూ విధిగా పాటించాల్సిన విధానాల గురించి ప్రజల్లోకి తీసుకుపోతున్నారు. విద్యార్థులు, రైతులు, వినియోగదారులు, పారిశ్రామిక వర్గాలను సైతం వారోత్సవాల్లో భాగస్వామ్యం చేస్తున్నాయి.



నగదు ఆదా అవుతోంది



గతంలో మా ఇంట్లో మామూలు విద్యుత్ గృహోపకరణాలు వినియోగించేవాళ్లం. దీంతో మా ఇంటికి నెలకు విద్యుత్ బిల్లు రూ.2,000 పైగా వస్తుండేది. అయితే ఆరునెలల నుంచి 5 స్టార్ రేటింగ్ కలిగిన వాషింగ్ మెషీన్, ఫ్రిజ్‌లతోపాటు ఎల్‌ఈడీ బల్బులను వాడుతున్నాం. దీంతో ఆరు నెలల నుంచి రూ.1,300 మించి విద్యుత్ బిల్లు రావటం లేదు. విద్యుత్ వినియోగం తగ్గి, నగదు కూడా ఎంతో ఆదా అవుతోంది.

– దేవరపల్లి నరసారెడ్డి, వినియోగదారుడు, నెల్లూరు

అవగాహన కల్పిస్తున్నాం



జిల్లా విద్యుత్ వినియోగదారులకు ఎలాంటి అంతరాయాల్లేని విద్యుత్‌ను అందిస్తున్నాం. ఇకపై కూడా అలాగే అందిస్తాం. అదేవిధంగా రానున్న వేసవి కాలంలో కూడా ఎలాంటి కోతల్లేకుండా సరఫరా చేసేందుకు సిద్ధంగా ఉన్నాం. విద్యుత్ ఆదాపై వినియోగదారులకు అవగాహన కార్యక్రమాలు నిర్వహించి విద్యుత్ ఆదా ఆవశ్యకతను వివరిస్తున్నాం. సహజ వనరులుగా ఉన్న సోలార్, విండ్‌ల (గాలిమరలు) ద్వారా ఉత్పత్తి అయ్యే విద్యుత్‌కు ఎక్కువ ప్రాధాన్యం ఇవ్వాల్సిన అవసరం ఉంది.

– వెంకటసుబ్బయ్య, ఎస్‌ఈ, ఏపీఎస్పీడీసీఎల్ జిల్లా సర్కిల్

రైల్వే కోర్టు నూతన భవనం ప్రారంభం



భవన ప్రారంభోత్సవంలో పాల్గొన్న జిల్లా జడ్జి యామిని

నెల్లూరు(క్రైమ్): నెల్లూరు రైల్వేస్టేషన్ సమీపంలోని పాత రైల్వే క్వార్టర్స్ వద్ద నూతనంగా నిర్మించిన రైల్వే కోర్టు భవనాన్ని జిల్లా జడ్జి యామిని శుక్రవారం ప్రారంభించారు. పాత భవనం శిథిలావస్థలో ఉండటంతో కోర్టును నూతన భవనంలోకి మార్చారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి రైల్వే కోర్టు మేజిస్ట్రేట్ ప్రసన్న, నెల్లూరు రైల్వే డీఎస్పీ పి.మల్లికార్జునరావు, సీఐ కె.శ్రీనివాసాచారి, ఆర్పీఎఫ్ ఇన్‌స్పెక్టర్ జి.వసంతరావు, రైల్వే ఎస్సైలు, సిబ్బంది పాల్గొన్నారు.

నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్ ధరలు



బ్రాయిలర్ (లైవ్)	: 109
లేయర్ (లైవ్)	: 75
బ్రాయిలర్ చికెన్	: 194
బ్రాయిలర్ స్కిన్‌లెస్	: 216
లేయర్ చికెన్	: 128

క్లుప్తంగా

ఎన్‌ఎంఎంఎస్‌కు అర్హులైన వారు పత్రాలు సమర్పించాలి

నెల్లూరు(టౌన్): నేషనల్ మీన్స్ కమ్ మెరిట్ స్కాలర్‌షిప్‌కు అర్హత సాధించిన విద్యార్థులు ఈనెల 20వ తేదీలోపు కుల, ఆదాయ, ఏడో తరగతి మార్కుల జాబితా, ఎవరికైనా అంగవైకల్యం ఉంటే ధ్రువీకరించే పత్రాలను సిద్ధం చేసుకోవాలని డీఈఓ నారాయణరావు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. విద్యాశాఖ అడిగిన వెంటనే కార్యాలయంలో హాల్‌టికెట్ జిరాక్స్ కాపీతోపాటు అన్ని పత్రాలను గడువు తేదీలోపు అందించాలన్నారు. సకాలంలో ఇవ్వని వారి వివరాలను తుదిజాబితా నుంచి తొలగిస్తారన్నారు. మరిన్ని వివరాల కోసం నెల్లూరు పొదలకూరు రోడ్డులోని జిల్లా పరిషత్ బాలికోన్నత పాఠశాలలో ఉన్న పరీక్షల విభాగాన్ని సంప్రదించాలని సూచించారు.

బీరాపేరు సమీపంలో మృతదేహం



అనుమసముద్రంపేట: మండల కేంద్రంలోని బీరాపేరు వాగు సమీపంలోని మీయాకత్ర వద్ద నీటిగుంతలో గుర్తు తెలియని వ్యక్తి మృతదేహాన్ని గుర్తించారు. ఏఎస్‌పేట ఎస్సై నరేష్ కథనం మేరకు.. శుక్రవారం గుంతలో మృతదేహాన్ని చూసిన స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. దీంతో ఎస్సై, సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. వివరాలు ఆరా తీశారు. చనిపోయింది దర్గాకు వచ్చిన మతిస్థిమితం లేని వ్యక్తా, లేక ఎవరైనా ఆత్మహత్య చేసుకున్నారా? తదితర కోణాల్లో విచారిస్తున్నట్లు ఎస్సై తెలిపారు. మృతుడి వయసు సుమారు 70 సంవత్సరాలుంటాయని భావిస్తున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం జిల్లా వైద్యశాలకు తరలించారు.

పొదలకూరు నిమ్మధరలు (కిలో)



పెద్దవి	: రూ.53
సన్నవి	: రూ.45
పండ్లు	: రూ.20

పర్యాటక ప్రాంతాల్లో నేరాల కట్టడికి చర్యలు

- పోలీస్ అవుట్‌పోస్టుల ప్రారంభం

నెల్లూరు(క్రైమ్): పుణ్యక్షేత్రాలు, పర్యాటక ప్రాంతాల్లో నేరాల కట్టడిలో భాగంగా ఆంధ్రప్రదేశ్ టూరిస్ట్ పోలీసు అవుట్‌పోస్టుల ఏర్పాటుకు ఎస్పీ సీహెచ్ విజయారావు ఆదేశాలతో అధికారులు చర్యలు చేపట్టారు. అందులో భాగంగా తొలివిడతగా జిల్లాలోని ప్రముఖ పుణ్యక్షేత్రమైన పెంచలకోనలోని లక్ష్మీనరసింహ స్వామి దేవస్థానం, పర్యాటక ప్రదేశాలైన కోడూరు, మైపాడుబీచ్‌ల్లో అవుట్‌పోస్టులను శుక్రవారం అందుబాటులోకి తీసుకొచ్చారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ పుణ్యక్షేత్రాలు, పర్యాటక ప్రాంతాల సందర్శనకు వచ్చే భక్తుల రక్షణకు, మార్గనిర్దేశం చేసేందుకు ఈ అవుట్‌పోస్టులు దోహదపడతాయన్నారు. వీటిల్లో 24 గంటలపాటు సిబ్బంది అందుబాటులో ఉంటూ అసాంఘిక కార్యకలాపాలు, నేరాలను కట్టడి చేస్తారన్నారు. ప్రధానంగా ఈవ్‌టీజింగ్, దొంగతనాలు జరగకుండా చూడటంతోపాటు బీచ్‌ల్లో ప్రమాదవశాత్తు ఎవరూ నీటిలో మునిగిపోకుండా చర్యలు తీసుకుంటారన్నారు. ఏదైనా నేరం జరిగితే బాధితులు అవుట్‌పోస్టులో ఫిర్యాదు చేయొచ్చన్నారు. దేవదాయ శాఖను సమన్వయం చేసుకుంటూ సందర్శకులు, భక్తులు, ప్రజలకు మెరుగైన సేవలందిస్తామన్నారు. వీటి సేవలను అందరూ వినియోగించుకోవాలని కోరారు.



మైపాడులో ఏర్పాటు చేసిన అవుట్‌పోస్ట్

రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలు ప్రారంభం

కోవూరు: కోవూరు మైథిలీ థియేటర్ వెనుకవైపు ఉన్న క్రీడా మైదానంలో రాష్ట్రస్థాయి ఆహ్వానిత కబడ్డీ పోటీలను శుక్రవారం రాత్రి డీఏబీ చైర్మన్ దొడ్డంరెడ్డి నిరంజన్‌బాబురెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎంతోమంది కబడ్డీలో రాణించి వివిధ ప్రభుత్వ శాఖల్లో ఉద్యోగాలు సంపాదించారన్నారు. క్రీడాకారులు గెలుపోటములను సమానంగా తీసుకోవాలన్నారు. తూర్పు గోదావరి, పశ్చిమ గోదావరి, కృష్ణ, గుంటూరు, ప్రకాశం, చిత్తూరు, నెల్లూరు జిల్లాల నుంచి జట్లు వచ్చాయి. పోటీలను ఆంధ్రా అసోసియేషన్ అనుమతితో నిర్వహిస్తున్నారు. కార్యక్రమంలో ఎంపీపీ టి.పార్వతి, జెడ్పీటీసీ సభ్యురాలు కె.శ్రీలత, మండల పరిషత్ ఉపాధ్యక్షుడు ఎస్.నరసింహులురెడ్డి, ఎస్సై దాసరి వెంకటేశ్వరరావు, వైఎస్సార్‌సీపీ యువజన విభాగం అధ్యక్షుడు చిరంజీవి, కబడ్డీ అసోసియేషన్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.



కబడ్డీ పోటీలో తలపడుతున్న క్రీడాకారులు

పోటీలను ప్రారంభిస్తున్న దృశ్యం

ఆపరేషన్ స్వేచ్ఛకు శ్రీకారం

- ఐదుగురు బాలకార్మికులకు విముక్తి

నెల్లూరు(క్రైమ్): బాలకార్మిక వ్యవస్థ నిర్మూలనలో భాగంగా రాష్ట్ర సీఐడీ విభాగం ఆదేశాల మేరకు ఈనెల 9 నుంచి 15వ తేదీ వరకు ఆపరేషన్ స్వేచ్ఛ కార్యక్రమానికి శ్రీకారం చుట్టామని ఎస్పీ సీహెచ్ విజయారావు తెలిపారు. శుక్రవారం డీఎల్ఎస్ఏ సెక్రటరీ/సీనియర్ సివిల్‌జడ్జి శ్రీనునాయక్, సహాయ కార్మిక అధికారి శాఖమూరి శ్రీనివాసనాయుడు, ఏహెచ్‌టీయూ ఇన్‌స్పెక్టర్ రామారావు, ఎస్సై విజయ్ శ్రీనివాస్, వారి బృందం నెల్లూరు నగరంలో విస్తృత తనిఖీలు చేపట్టారు. వారధి సెంటర్‌లోని ఇటుకబట్టీలో పనిచేస్తున్న ముగ్గురు బాలురు, ఓ బాలికను సంరక్షించారు. బట్టీ నిర్వాహకుడు గోవింద్‌పై సంతపేట పోలీసులకు ఫిర్యాదు అందడంతో కేసు నమోదు చేశారు. అలాగే వారధి సెంటర్‌లో కొయ్య పనిచేస్తున్న ఓ బాలుడిని గుర్తించారు. అతని తల్లిదండ్రులకు కౌన్సెలింగ్ ఇచ్చారు. బాలల చేత పనులు చేయించడం చట్ట ప్రకారం నేరమని, వెట్టిచాకిరి, బాలకార్మిక వ్యవస్థ నిర్మూలనే ధ్యేయంగా సిబ్బంది పనిచేయాలని ఎస్పీ సూచించారు.



బాలలతో మాట్లాడుతున్న అధికారులు

60 వేల మంది కూలీలు హాజరుకావాలి

- డ్వామా పీడీ వెంకట్రావు

నెల్లూరు(పొగతోట): ఉపాధి హామీ పనులకు రోజుకు 60 వేల మంది కూలీలు హాజరయ్యేలా ప్రత్యేక చర్యలు చేపట్టాలని డ్వామా పీడీ వెంకట్రావు ఆదేశించారు. నెల్లూరులోని డ్వామా కార్యాలయం నుంచి శుక్రవారం వివిధ మండలాల అధికారులు, ఉపాధి హామీ సిబ్బందితో పీడీ టెలీకాన్ఫరెన్స్‌లో మాట్లాడారు. ఈ ఆర్థిక సంవత్సరంలో 1.15 కోట్ల పనిదినాలు కల్పించాలని ప్రభుత్వం లక్ష్యంగా నిర్దేశించిందన్నారు. ఇప్పటి వరకు 90 లక్షల పనిదినాలు కల్పించామన్నారు. నిర్దేశించిన లక్ష్యాన్ని పూర్తి చేసేలా ప్రత్యేక చర్యలు తీసుకోవాలన్నారు. ఉపాధి హామీ సిబ్బంది క్షేత్రస్థాయిలో పర్యటించి జాబ్‌కార్డులు కలిగిన కూలీలందరూ పనులకు హాజరయ్యేలా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. కూలీలు చేసిన పనుల వివరాలను ఎన్ఐసీ వెబ్‌సైట్‌లో అప్‌లోడ్ చేయాలన్నారు. వారి ఆధార్‌కార్డులను అనుసంధానం చేయాలని తెలిపారు.

వీఓఏ తొలగింపు

మర్రిపాడు: మండలంలోని కంపసముద్రం గ్రామ వీఓఏను ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు విధుల నుంచి తొలగించామని ఏపీఎం బుజ్జమ్మ తెలిపారు. శుక్రవారం ఆమె మాట్లాడుతూ గ్రామంలో స్త్రీనిధికి సంబంధించి రూ.13.36 లక్షలను వీఓఏ సొంతానికి వినియోగించినట్లు విచారణలో తేలడంతో తొలగించామన్నారు. అంతేకాకుండా వీఓఏ నుంచి రూ.లక్ష రికవరీ చేశామన్నారు. మిగిలిన మొత్తాన్ని కూడా త్వరలోనే రికవరీ చేస్తామన్నారు. గ్రామస్థాయిలో వీఓఏలు అవినీతికి పాల్పడితే ఉపేక్షించేది లేదని ఏపీఎం హెచ్చరించారు.